సాక్షి శ్రీకాకుళం

శనివారం । 13 । సెప్టెంబర్ । 2025



పక్షుల విడిదిలో..

పక్షుల విడిదిలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. తేలినీలాపురంలో సౌకర్యాలు లేవు.

- 8లో



విద్యుత్ షాక్‌తో..

విద్యుత్ షాక్‌తో సచివాలయ ఉద్యోగి మృతి చెందాడు. కిష్టుపురంలో ఘటన జరిగింది.

- 8లో

బంగాళాఖాతంలో అల్ప పీడనం

శ్రీకాకుళం పాతబస్టాండ్: బంగాళాఖాతంలో అల్ప పీడనం వల్ల ఉత్తరాంధ్ర, ఒడిశా తీరంలో వర్షాలు కురుస్తున్నాయి. దీని ప్రభావం మరో 48 గంటలు వరకు ఉంటుందని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తున్నారు. ఈ అల్ప పీడనం ఒడిశా, ఉత్తరాంధ్ర, దక్షిణ చత్తీస్‌గఢ్ దిశగా ప్రయాణించే అవకాశం ఉందని చెబుతున్నారు. దీని ప్రభావంతో ఉత్తరాంధ్రలో పలు చోట్ల వర్షాలు కురిసే అవకాశం ఉందని, తీరం వెంబడి 40-50 కిలోమీటర్ల వేగంతో ఈదురుగాలులు వీస్తాయని పేర్కొన్నారు.

అక్షరమే ఆయుధం



పత్రికా స్వేచ్ఛను కాలరాయడమే



పత్రికా స్వేచ్ఛను కాలరాయాలనుకోవడం అవివేకం. కూటమి వ్యవహరిస్తున్న తీరు ప్రజాస్వామ్య స్ఫూర్తికే ప్రమాదంగా కనిపిస్తోంది. తాజాగా 'సాక్షి' ఎడిటర్ ఆర్.ధనంజయరెడ్డిపై ప్రభుత్వం పోలీసు కేసులు పెట్టించడం అనాగరిక చర్య.

– నర్తు రామారావు, ఎమ్మెల్సీ

కేసులు దారుణం




కూటమి ప్రభుత్వ అక్రమాలు, అవినీతిపై కథనాలు రాస్తే అక్రమ కేసులు నమోదు చేయడం దారుణం. ఇది పూర్తిగా మీడియా స్వేచ్ఛను హరించడమే. సమాజ హితం కోసం నిజాలు రాస్తే పోలీసులతో అక్రమ కేసు పెట్టించడం గతంలో ఏ ప్రభుత్వాల్లోనూ జరగలేదు. ఇలాంటి పద్ధతులు మానుకోవాలి.

– పిరియా విజయ, జెడ్పీ చైర్‌పర్సన్, శ్రీకాకుళం

నేతల యూరియా మేత!

టీడీపీ నాయకుడు సిమ్మ చంద్రశేఖర్ డబ్బు ఇవ్వకుండా 100 బస్తాలు దాచేయమన్నారు. అప్పటికే రైతులు ఆధార్ కార్డు, వన్‌బీ, డబ్బులు పట్టుకుని ఉన్నారు. ఈయన డాక్యుమెంట్స్ ఇవ్వలేదు సరికదా రైతులకు యూరియా ఇవ్వవద్దని అన్నారు. కానీ, రైతులకే ఇచ్చాను. దీంతో ఆయనకు ఇవ్వలేదని ఎమ్మెల్యేకు చెప్పి నాకు డిప్యూటేషన్‌పై వేసేశారు. – ఇదీ కిల్లాం మాకివలసలో విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్‌కు ఎదురైన పరిణామం

నరసన్నపేట పీఏసీఎస్‌కు వచ్చిన 400బస్తాలు యూరియా టీడీపీ నాయకులే పంచుకున్నారు. ఇతరులెవ్వరికీ ఇవ్వలేదు. ఇలా చేస్తే రైతులు ఏమవ్వాలి.
– మండల సమావేశంలో ఎంపీటీసీ ప్రతినిధి కింతలి చలపతిరావు



- టీడీపీ నేతల ఇళ్లకు చేరుతున్న యూరియా
- యూరియా కోసం విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లపై తీవ్ర ఒత్తిళ్లు
- తప్పని పరిస్థితుల్లో తలొగ్గిన వీఏఏలు
- మాట వినని వీఏఏలపై కక్ష సాధింపు చర్యలు
- డబ్బులు సైతం ఇవ్వకుండా యూరియా బస్తాలు తీసుకెళ్లిపోయిన దుస్థితి
- మానసికంగా, ఆర్థికంగా క్షోభకు గురవుతున్న విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లు

సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం:

జిల్లాలో యూరియాను టీడీపీ నేతలు హైజాక్ చేస్తున్నారు. యూరియా పంపిణీ విషయంలో విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్లు (వీఏఏ) ఎంత ఒత్తిళ్లకు గురయ్యారో ఇటీవల జరిగిన సంఘటనలు స్పష్టం చేస్తున్నాయి. డబ్బులు చెల్లించకుండా టీడీపీ నాయకులు దౌర్జన్యంతో యూరియా ఎలా తీసుకెళ్లారో వారు ధర్నా చేసి మరీ వివరించారు.
జిల్లాకు 51 వేల మెట్రిక్ టన్నుల వరకు యూరియా అవసరం కాగా 25 వేల మెట్రిక్ టన్నుల లోపే రావడంతో కొరత ఏర్పడింది. వచ్చిన అరకొర యూరియాలో చాలా వరకు టీడీపీ నాయకులు తమ ఇళ్లల్లో దించుకున్నారు. రైతు సేవా కేంద్రాల్లో ఉన్న యూరియాను సైతం 50, 100, 150 బస్తాలు చొప్పున టీడీపీ నాయకులు దౌర్జన్యంతో తీసుకెళ్లిపోయారు. విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్స్‌కు ఫోన్లు చేసి, నేరుగా కలిసి, తమకు ప్రత్యేకంగా బస్తాలు దాచాలని చెప్పారంటే జిల్లాలో ఎంత బరితెగించారో అర్థం చేసుకోవచ్చు. నేతల ఒత్తిళ్లకు తలొగ్గి చాలాచోట్ల తలొగ్గాల్సి వచ్చింది. ఎక్కడైతే వ్యతిరేకించారో వారు షోకాజ్ నోటీసులు, సస్పెన్షన్లు, డిప్యుటేషన్లు ఎదుర్కోవాల్సి వచ్చింది. ఇంకా దారుణమేంటంటే అడ్డగోలుగా తీసుకెళ్లిపోయిన యూరియా బస్తాలకు డబ్బులు కూడా చెల్లించలేదు. ఆ భారాన్ని విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్స్ భరించాల్సి వచ్చింది. అసలే వారికి అరకొర జీతాలు, ఆపైన యూరియా సొమ్ము సొంతంగా చెల్లింపులు వెరసి ఆర్థికంగా నష్టపోయారు.

నిదర్శనాలు ఇవే..

- కరగాం పంచాయతీ టీడీపీ నాయకుడు పంగ బావాజీ మొదట విడతగా 45బస్తాలు తీసుకెళ్లారు. రెండో విడతగా రైతులకు ఇస్తానని మరో 50 బస్తాలు తీసుకెళ్లిపోయారు. వాటిని సొంతానికి వాడుకున్నారు. ఏ రకంగా ఇచ్చారని స్థానిక టీడీపీ కార్యకర్తే వ్యతిరేకించారు. వీఏఏను నిలదీశారు. జాయింట్ డైరెక్టర్ పర్మిషన్ ఇవ్వడం వల్ల ఇచ్చామని విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్ సమాధానం ఇచ్చారు.
- రణస్థలం మండలంలో రావాడ, రణస్థలం పంచాయతీలో యూరియా పూర్తిగా టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో, వాళ్లకు అనుకూలమైన వ్యక్తులకు ఇచ్చారన్న విమర్శలు ఉన్నాయి. అంతేకుండా పంచాయతీలో ఉన్న రైతుల్ని పక్కన పెట్టి పక్క జిల్లా షాపులకు విక్రయించారన్న ఆరోపణలు ఉన్నాయి.
- సంచాం పంచాయతీలో యూరియా పంపిణీ సమయంలో మహిళా విలేజ్ అగ్రికల్చరల్ అసిస్టెంట్‌పై దుర్భాషలు, పరుషపదజాలం వాడి ఉద్యోగికి తీవ్రమైన మానసిక ఒత్తిడికి కలిగించడం వల్ల ఆ ఉద్యోగి మెడికల్ లీవ్‌కు వెళ్లే పరిస్థితి వచ్చింది.

యూరియా.. ఇంత నిర్లక్ష్యం ఎందుకయ్యా..?

- వానకు తడిచిపోతున్న యూరియా బస్తాలు
- ఆమదాలవలస రైల్వే గూడ్స్‌షెడ్ వ్యాగన్ నుంచి వర్షంలోనే లారీలకు లోడ్‌చేస్తున్న దృశ్యం
- అపరాధ రుసుం భయంతో ప్లాట్‌ఫాంపైనే నిల్వలు
- ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయని వ్యవసాయ శాఖ అధికారులు



ప్లాట్‌పాంపై వర్షంలో తడుస్తున్న యూరియా నిల్వలు

ఆమదాలవలస రూరల్:

అసలే యూరియా కొరతతో జిల్లా సతమతమవుతూ ఉంటే వచ్చిన సరుకును కూడా సరిగా సంరక్షించకుండా అధికారులు నిర్లక్ష్యం చూపిస్తున్నారు. ఆమదాలవలస రైల్వే స్టేషన్‌కు యూరియా నిల్వలు వస్తాయన్న సంగతి తెలిసిందే. ఎన్‌డీఆర్ సంస్థకు సంబంధించి గురువారం సాయంత్రం ఓ వ్యాగన్ రాగా.. మరో వ్యాగన్ శుక్రవారం ఉదయం వచ్చింది. కానీ శుక్రవారం ఉదయం ఎడ తెరిపి లేని వాన కురవడంతో యూరియా తడిచి ముద్దయ్యింది. వాస్తవంగా రైల్వేగూడ్‌షెడ్ వ్యాగన్ నుంచి వచ్చిన సరుకులను ఆ వ్యాగన్ పరిమాణాన్ని బట్టి 5–8 గంటల్లోపు ఖాళీ చేయాలి. లేదంటే రైల్వే శాఖకు అపరాధ రుసుం కట్టాలి. అపరాధ రుసుం భయంతో కంపెనీ యజమానులు యూరియాను వర్షంలోనే అన్‌లోడ్ చేశారు. దీంతో యూరియా తడిచిపోయింది.



ఆమదాలవలస రైల్వేగూడ్స్ షెడ్ వద్ద వ్యాగన్ నుంచి వర్షంలో లారీలకు లోడింగ్ చేస్తున్న దృశ్యం

వ్యవసాయాధికారుల ఆచూకీ కరువు

అసలే రైతులు ఎరువుల కోసం నానా ఇబ్బందులు పడుతుంటే.. వ్యవసాయ శాఖాధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం ఆశ్చర్యం కలిగిస్తోంది. ఎరువులు ప్రభుత్వానివైనా, ప్రైవేటువైనా వ్యవసాయ శాఖాధికారులు వ్యాగన్ వద్దకు వచ్చి పరిశీలించాలి. వర్షం వచ్చిన సమయంలో వ్యాగన్ నుంచి యూరియా దించేందుకు ఎట్టి పరిస్థితుల్లో అనుమతించకూడదు. ఒక వేళ అన్‌లోడ్ చేసినా కనీసం టార్పాలిన్లు అయినా కప్పాలి. కానీ శుక్రవారం లోడ్ రాగా పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించారు. వర్షానికి తడిచిన యూరియా పటుత్వం కోల్పోతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

ఉద్యోగం చేయాలంటే భయమేస్తోంది

- డీఆర్‌డీఏ పీడీని కలిసిన ఏపీఎంలు



పీడీ కిరణ్‌కుమార్‌ను కలిసిన ఏపీఎంల సంఘం ప్రతినిధులు

శ్రీకాకుళం పాతబస్టాండ్: డీఆర్‌డీఏ వెలుగులో మండల స్థాయిలో ఏపీఎం క్యాడర్‌లో ఉద్యోగాలు చేయడం కత్తి మీద సాములా మారిందని, రాజకీయ నాయకులు వారి అనుచరుల నుంచి దాడులు, ఇబ్బందులు వస్తున్నాయని, రక్షణ కల్పించాలని వెలుగు ఏపీఎంల సంఘం ప్రతినిధులు శుక్రవారం సాయంత్రం డీఆర్‌డీఏ పీడీ కిరణ్‌కుమార్‌ను కలిసి విన్నవించారు. ఇటీవల కొత్తూరు ఏపీఎం ఎ.లలితపై కొత్తూరు గ్రామానికి చెందిన ఇద్దరు వ్యక్తులు దాడి చేశారని తెలిపారు. అధికారుల సూచనలతో సేవలు అందిస్తున్నా రాజకీయ ఒత్తిళ్లు భరించలేకపోతున్నామని తెలిపారు. దాడి చేసిన వారిపై కేసులు నమోదు చేయాలని, అరెస్టు చేసేలా చూడాలని కోరారు. అన్ని పనులు చేస్తున్నా, కొంతమంది నాయకులు కావాలనే తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని తెలిపారు. కొత్తూరుకు చెందిన వెలుగు సిబ్బందితో రహస్య సమావేశాలు పెడుతున్నారని, దీన్ని నివారించాలని వినతిపత్రంలో కోరారు. కార్యక్రమంలో ఏపీఎంల జిల్లా అధ్యక్షుడు సనపల ప్రసాద్, ఏపీఎంలు జాంబవతి, ఉమ, సుశీల, రజిని, లక్ష్మి, విజయకుమారి, లక్ష్మి, గోవిందు, ప్రసాద్, కూర్మారావు, మనోరత్నం, హేమ సుందర్, రాజారావు, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

థర్మల్ ప్లాంట్‌పై సమర శంఖం



థర్మల్ వ్యతిరేక పోరాటానికి సిద్ధమైన అఖిల పక్ష కమిటీ నేతలు

- బలవంతపు భూసేకరణ ఆపాలి
- తీర్మానం చేసిన పోరాట అఖిల పక్ష కమిటీ

సరుబుజ్జిలి/బూర్జ: థర్మల్ ప్లాంట్ నిర్మాణ ప్రతిపాదనలు ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని, లేకుంటే ఉద్యమం తప్పదని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి, సీపీఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు హెచ్చరించారు. మండలంలోని వెన్నెలవలస థర్మల్ వ్యతిరేక పోరాట కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం భారీ ర్యాలీ చేశారు. అనంతరం నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం 20 లక్షల ఎకరాల భూమిని కార్పొరేట్ కంపెనీలకు ధారాదత్తం చేసేందుకు ప్రయత్నిస్తోందని, మన జిల్లాలోనూ పవర్ ప్లాంట్, కార్గో ఎయిర్‌పోర్టు పేరుతో వేలాది ఎకరాలు కార్పొరేట్లకు అప్పగించేందుకు చూస్తోందని వెల్లడించారు. రైతుల అనుమతులు లేకుండా డ్రోన్ సర్వేలు చేయడం చట్ట వ్యతిరేకమని రైతుకూలీ సంఘం అధ్యక్షుడు వంకల మాధవరావు అన్నారు. థర్మల్ ప్లాంట్ కడితే హిరమండలం రిజర్వాయర్ నుంచి నీటిని తెచ్చి సాగుభూములను బీడు భూములుగా మారుస్తారని న్యూ డెమొక్రసీ జిల్లా కార్యదర్శి తాండ్ర ప్రకాశరావు వెల్లడించారు. పవర్ ప్లాంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని నేరడి వద్ద బ్యారేజీ కడితే రూ.13వేల కోట్ల ఆదాయం వస్తుందని ఆంధ్రప్రదేశ్ రైతుకూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కోనారి మోహనరావు వివరించారు. ఆమదాలవలసపై ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు చిత్తశుద్ధి ఉంటే సుగర్ ఫ్యాక్టరీ తెరిపించాలని గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి నిమ్మక అప్పన్న డిమాండ్ చేశారు. బలవంతపు భూసేకరణ అడ్డుకుంటామని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడు కంత అప్పలనాయుడు హెచ్చరించారు. అఖిల పక్ష సమావేశానికి అధికారులు హాజరు కాకపోవడం చర్చనీయాంశమైంది.

'చంద్రబాబుకి గుణపాఠం చెప్పాలి'



బస్టాండ్ కూడలికి చేరిన రాజ్యాంగ పరిరక్షణ యాత్ర

ఇచ్ఛాపురం: దళితుల్లో రిజర్వేషన్లు సృష్టించి మాలలకు అన్యాయం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడికి గుణపాఠం చెప్పాలని రాజ్యాంగ పరిరక్షణ యాత్ర నిర్వాహకులు, రాష్ట్ర మాల ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్‌బాబు, రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చెన్న కేశవులు అన్నారు. ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు చేపట్టిన రాజ్యాంగ పరిరక్షణ యాత్రకు శుక్రవారం ఇచ్ఛాపురంలో ముగింపు పలికారు. పట్టణంలో మెయిన్ రోడ్డు నుంచి బస్టాండ్ వరకు యాత్ర నిర్వహించారు. అనంతరం బస్టాండ్ కూడలిలో గల బీఆర్ అంబేడ్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. రాష్ట్రంలో 42 లక్షల మంది మాలలు చంద్రబాబు ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఓట్లు వేశారన్న కక్షతో రాష్ట్రంలో రిజర్వేషన్లను ఏర్పాటుచేసి మాలలకు సామాజికంగాను, ఉద్యోగపరంగా చాలా అన్యాయం చేశారని అన్నారు. ఎస్సీ వర్గీకరణపై పునఃసమీక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సల్లా దేవరాజ్, నూతలపాటి బాబురావు, నగిరి మోహన్‌రావు, పందిరి లోకేష్, రామారావు, వెంకటరావు, గువ్వాడ దిలీప్, డి.వాసు, బాగ నగేష్, బాగ వేణు, కొప్పల హేమంత్, ప్రియ, తులసీ తదితరులు పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

పలాస డిగ్రీ కళాశాలకు యునిసెఫ్ గుర్తింపు

పలాస: పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు యునైటెడ్ నేషన్స్ ఇంటర్నేషనల్ చిల్డ్రన్స్ ఎమర్జెన్సీ ఫండ్(యూనిసెఫ్) గుర్తింపు లభించిందని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టరు జె.వెంకటలక్ష్మి చెప్పారు. కళాశాలలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ 2024–25 విద్యాసంవత్సరంలో లెర్నింగ్ ఇంప్రూవ్‌మెంట్ ప్రోగ్రాంలో విద్యార్థులు కనబరిచిన ప్రతిభకు గాను ఈ గుర్తింపు లభించిందన్నారు. పలాసను రాష్ట్ర స్థాయిలో పైలెట్ ప్రాజెక్టుకు ఎంపిక చేశారని చెప్పారు. ఈ సందర్భంగా ఈ ప్రాజెక్టు కింద ఎంపికైన 30 మంది విద్యార్థులకు ప్రథమ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ ప్రాజెక్టుకు ఎంపిక చేసిన డాక్టరు నారాయణ, భరత్ గుప్తా, డాక్టరు సి.కృష్ణలకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ గణపతిరావు, ఎంఈఓ శ్రీనివాసరావు, ఆర్.అప్పారావు, జె.శంకర్, జి.గొల్ల, దీపకుమారి అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎంపీడీఓలుగా పదోన్నతి



జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయను సత్కరిస్తున్న నూతన అధికారులు

శ్రీకాకుళం న్యూకాలనీ: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేసి, నాణ్యమైన సేవలను అందించాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ పిరియా విజయ పేర్కొన్నారు. జెడ్పీ బంగ్లాలో మండల ప్రజా పరిషత్ కార్యాలయాల్లో డిప్యూటీ ఎంపీడీఓ/పరిపాలనాధికారులుగా పనిచేస్తున్న పలువురు ఉద్యోగులకు ఎంపీడీఓలుగా పదోన్నతి కల్పిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో వీరికి నియామక పత్రాలను అందజేశారు. నియామక పత్రాలు అందుకున్నవారిలో జె.ఆనందరావు, (డిప్యూటీ ఎంపీడీఓ, ఎంపీపీ, కోటబొమ్మాళి)ను రాజాం ఎంపీడీఓగా, టి.రాజారావు (డిప్యూటీ ఎంపీడీఓ, ఎంపీపీ నందిగాం)ను వంగర మండలం ఎంపీడీఓగా, ఎస్.వసంత కుమారి (డిప్యూటీ ఎంపీడీఓ, ఎంపీపీ కొత్తూరు)ను భామిని ఎంపీడీఓగా నియమిస్తూ ఉత్తర్వులు అందజేశారు. నూతన అధికారులు జెడ్పీ చైర్‌పర్సన్‌ను సత్కరించారు. మంచి సేవలు అందించి అధికారులు, ప్రజల మన్ననలు అందుకోవాలని ఈ సందర్భంగా పిరియా విజయ ఆకాంక్షించారు.

ముగిసిన కళా ఉత్సవం పోటీలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న డిప్యూటీ డీఈఓ ఆర్.విజయకుమారి, ప్రిన్సిపాల్ గౌరీశంకర్

గార: వమరవల్లి డైట్‌లో గత రెండు రోజులుగా జరిగిన కళా ఉత్సవం–2025 పోటీలు శుక్రవారం సాయంత్రంతో ముగిశాయి. రెండో రోజు నిర్వహించిన పోటీల్లో థియేటర్ విజిల్ ఆర్ట్స్ విభాగంలో కొత్తపల్లి జెడ్పీహెచ్‌ఎస్, విజువల్ ఆర్ట్స్ త్రీడీ అండ్ టూడీ విభాగంలో కవిటి హైస్కూల్, ట్రెడిషనల్ స్టోరీ టెల్లింగ్ కొత్తపల్లి జెడ్పీహెచ్‌ఎస్ ప్రథమ స్థానంలో నిలిచాయి. వీరికి డిప్యూటీ డీఈఓ ఆర్. విజయకుమారి విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ గౌరిశంకర్, నోడల్ అధికారి తడేల వెంకటరావు పాల్గొన్నారు.

బకాయిలను తక్షణమే చెల్లించాలి

వజ్రపుకొత్తూరు రూరల్: ఉపాధ్యాయులకు రావాల్సిన అన్ని రకాల బకాయిలను తక్షణమే చెల్లించాలని ఉపాధ్యాయ సంఘ నాయకులు డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఏపీ టీచర్ ఫెడరేషన్ రాష్ట్ర సంఘం పిలుపు మేరకు చేపడుతున్న నిరసన వారం కార్యక్రమంలో భాగంగా శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేసి మెమో నంబర్ 57ను తక్షణమే అమలు చేయాలని, 12వ పీఆర్సీ కమీషన్ నియమించి ఐఆర్ ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే ఈహెచ్‌ఎస్ పరిమితిని రూ.25 లక్షలకు పెంచాలని, ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా అకాడమీ కమిటీ సెల్ కన్వీనర్ ఎల్.కరుణాకర్, ఉపాధ్యాయ సంఘ నాయకులు పాల్గొన్నారు.



ఉప తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉపాధ్యాయ సంఘ నాయకులు

మేఘ సందేశం



కొవ్వాడ సముద్రతీరంలో శుక్రవారం ఉదయం అద్భుత దృశ్యం ఆవిష్కృతమైంది. సముద్రంలోని నీటిని మేఘాలు పైకి లాక్కుంటున్నట్టు కనిపించిన దృశ్యాలను మత్స్యకారులు ఆసక్తిగా తిలకించారు. - రణస్థలం

వ్యవసాయ డిప్లమో కోర్సుల ప్రవేశాలకు కౌన్సెలింగ్



ఆమదాలవలస : ఆచార్య ఎన్జీ రంగా విశ్వవిద్యాలయం పరిధిలో నిర్వహించే వ్యవసాయ పాలిటెక్నిక్ డిప్లమో కోర్సుల ప్రవేశాలకు ఈ నెల 15వ తేదీన గుంటూరులోని లామ్ ఫారంలో స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు ఆమదాలవలస మండలం తొగరాం ప్రభుత్వ వ్యవసాయ పాలిటెక్నికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీపాన నీలవేణి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. అధికార వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులతో పాటు అసలు రిజిస్ట్రేషన్ చేయించుకోని వారు సైతం 10వ తరగతి పాస్ అయి ఉంటే హాజరు కావచ్చున ని తెలిపారు. పూర్తి వివరాలకు 77023 94824 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కోళ్ల వ్యాన్ బోల్తా

- కోళ్లు తీసుకెళ్లేందుకు ఎగబడిన జనం



చనిపోయిన కోళ్లను తీసుకువెళ్తున్న దృశ్యం

టెక్కలి రూరల్: స్థానిక జగతిమెట్ట సమీప జాతీయ రహదారిపై శుక్రవారం వేకువజామున కోళ్ల లోడుతో వెళ్తున్న వ్యాన్ ఒక్కసారిగా అదుపు తప్పి బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాలు ప్రకారం.. ఒడిశా నుంచి కోళ్ల లోడ్‌తో టెక్కలి మీదుగా బొబ్బిలి వైపు వెళ్తున్న కోళ్ల వ్యాన్ టెక్కలి సమీప జగతిమెట్ట వద్దకు వచ్చే సరికి టైర్ ఒక్కసారిగా పేలిపోవడంతో రోడ్డు మధ్యలో బోల్తా పడింది. ఘటనలో డ్రైవర్ అమిర్ భాషాకు స్వల్ప గాయాలయ్యాయి. అతడిని టెక్కలి జిల్లా ఆస్పత్రికి తరలించారు. అనంతరం హైవే సిబ్బంది కోళ్ల వ్యాన్‌ను పక్కకు తీశారు. వ్యాన్‌లో దాదాపు 1400 కోళ్లు ఉండగా అందులో సగానికి పైగా మృతిచెందాయి. దీంతో ఆ చనిపోయిన కోళ్ల కోసం చుట్టు పక్కల ప్రాంతాల వారు ఎగబడ్డారు. ఎవరికి దొరికిన కోళ్లను వారు తీసుకెళ్లిపోయారు. మృతి చెందిన కోళ్ల విలువ రూ.లక్షల్లో ఉంటుందని యజమాని తెలిపారు.

టమాటా లారీ బోల్తా

రణస్థలం: లావేరు మండలంలోని రావివలస సమీపంలో జాతీయ రహదారి–16పై శుక్రవారం తెల్లవారుజామున టమాటా లారీ అదుపు తప్పి బోల్తా పడింది. డ్రైవర్‌కు గాయాలు కావడంతో 108పై శ్రీకాకుళం తరలించారు. రహదారికి అడ్డంగా లారీ పడిపోవడంతో గంట పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది.



రహదారి మధ్యలో బోల్తాపడిన వ్యాన్‌ను క్రేన్ సాయంతో పక్కకు తీస్తున్న సిబ్బంది

వానకు దారి ధ్వంసం

హిరమండలం: మండలంలో కొద్ది రోజులుగా కురుస్తున్న వానలతో రహదారులు ధ్వంసమయ్యాయి. ప్రధానంగా ఎల్‌ఎన్‌పేట మండలం తురకపేట–దబ్బపాడు గ్రామాల మధ్య కడపలవానిగెడ్డ పొంగి ప్రవహించడంతో రోడ్డు దారుణంగా దెబ్బతింది. ఈ క్రమంలో శుక్రవారం గోతుల్లో వ్యాన్ దిగబడింది. అతి కష్టం మీద దాన్ని పక్కకు తొలగించారు. ప్రస్తుతం రాకపోకలు సాగించేందుకు వీలు లేదు.



ఎల్ఎన్‌పేట తురకపేట కడపలవాని గెడ్డ వద్ద గతుకుల రోడ్డులో దిగబడిన వ్యాన్

క్లుప్తంగా

భూఆక్రమణ అడ్డగింత



స్థలం గేటుకు తాళం వేస్తున్న చిగురువలస గ్రామస్తులు

సరుబుజ్జిలి: చిగురువలస పంచాయతీ శ్రీరాంవలస రెవెన్యూ గ్రామంలో 9–1, 9–3 సర్వే నంబర్లలో ఎకరా 60 సెంట్ల ప్రభుత్వ భూమి ఉంది. ఈ గ్రామకంఠం భూమిని కొందరు స్థానికులు పార్వతీపురం మన్యం జిల్లాకు చెందిన వ్యక్తికి అనధికార విక్రయం చేసినట్లు సమాచారం. దీంతో కొనుగోలుదారుడు సదరు భూమిని చదును చేస్తుండగా చిగురువలస గ్రామస్తులు శుక్రవారం అడ్డుకున్నారు. స్థలం ప్రధాన గేటుకు తాళం వేసి పోలీసులకు ఫిర్యాదు చేశారు. రెవెన్యూ రికార్డులను తారుమారు చేసి ప్రభుత్వ భూములను ఇష్టారాజ్యంగా విక్రయాలు చేస్తున్నారని గ్రామస్తులు ఆరోపించారు. అధికారులు వెంటనే పరిశీలించి ఆక్రమణదారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయమై తహసీల్దార్ మధుసూదన్ వద్ద ప్రస్తావించగా క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ఆక్రమణదారులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు.

సంపూర్ణ అక్షరాస్యత లక్ష్యం



మాట్లాడుతున్న సుధాకరరావు

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలో సంపూర్ణ అక్షరాస్యత సాధించేందుకు కృషి చేయాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ అధికారి సుధాకరరావు అన్నారు. శుక్రవారం జిల్లా మహిళా సమాఖ్య కార్యవర్గ సమావేశ మందిరంలో వయోజన విద్యా శాఖ ఆధ్వర్యంలో ఉల్లాస్ కార్యక్రమంపై వలంటీర్లకు ఓరియంటేషన్ ప్రోగ్రాం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 15 ఏళ్లు దాటిన నిరక్షరాస్యులందరినీ అక్షరాస్యులుగా మార్చడం కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. గ్రామాల్లో స్వచ్ఛందంగా వలంటీర్లు బోధన చేయాలన్నారు. వయోజన విద్యా జిల్లా ఉప సంచాలకుడు ఎ.సోమేశ్వరరావు మాట్లాడుతూ 11207 మంది వలంటీర్లకు శిక్షణ ఇచ్చి లక్షా 12 వేల మందిని అక్షరాస్యులుగా తీర్చిదిద్దుతామని చెప్పారు. కార్యక్రమంలో ట్రైనర్లు కె.వెంకటరమణ, పి.వెంకటరమణ, డీఎల్‌డీఓ చంద్రకుమారి, వయోజన విద్యా ఏపీఓ బాలచంద్ర, పర్యవేక్షకులు ఎల్.రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఎరువుల కోసం ఆందోళన చెందవద్దు

శ్రీకాకుళం పాతబస్టాండ్: రైతులు ఎరువుల కోసం ఆందోళన చెందవద్దని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అన్నారు. శుక్రవారం డయల్ యువర్ కలెక్టర్ కార్యక్రమం నిర్వహించి రైతుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తమకు రెండవ సారి ఎరువులు ఇంకా అందలేదని, ఎరువులు ఎప్పుడు వస్తాయని పలువురు రైతులు కలెక్టర్‌ను అడిగారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఇంత వరకు యూరియా తీసుకోని రైతులకు సంబంధిత మండల వ్యవసాయ అధికారులు వెంటనే యూరియా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు.

రేపటి నుంచి హిందీ పక్షోత్సవాలు

శ్రీకాకుళం న్యూకాలనీ: ఈ నెల 14న జాతీయ హిందీ దినోత్సవం పురస్కరించుకుని జిల్లాలో 15 రోజులపాటు హిందీ పక్షోత్సవాలు నిర్వహిస్తున్నట్టు హిందీ వికాస వేదిక అధ్యక్షుడు మందపల్లి రామకృష్ణారావు, ప్రధాన కార్యదర్శి నిరంజన్ ఖడంగా శుక్రవారం తెలిపారు. విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు, కవుల వేషధారణలు, కవితాగానం, దేశభక్తి గేయాలు, చిత్రలేఖనం, ఉపాధ్యాయులకు ఉత్తరాలు, స్నేహితులకు లేఖలు, అందమైన చేతిరాత(సులేఖన్) పోటీలు, ఏకపాత్రాభినయం, నాటికలు, జాతీయ సమైఖ్యతాదాపకాల ప్రదర్శన వంటి పోటీలు నిర్వహించి బహుమతులు అందజేస్తామని రామకృష్ణారావు, నిరంజన్ పేర్కొన్నారు. వివరాలకు 94416 49118 నంబర్‌ను సంప్రదించవచ్చన్నారు.

తేలినీలాపురం పక్షుల విడిది కేంద్రంలో చెట్లపై ఉన్న పక్షులు (ఫైల్)



పక్షుల విడిదిలో.. సమస్యల కొలువు

- తేలినీలాపురంలో కనీస సౌకర్యాలు కరువు
- శిథిలావస్థకు వాచ్‌టవర్
- మౌలిక వసతులు లేక పర్యాటకుల అవస్థలు



పెచ్చులూడిపోతున్న టవర్ మెట్ల మార్గం

టెక్కలి రూరల్ :

ప్రముఖ పర్యాటక స్థలం, విదేశీ పక్షుల విడిది తేలినీలాపురంలో సమస్యలు తిష్టవేశాయి. ఏటా శీతాకాలం ఆరంభంలో సైబీరియా దేశం నుంచి పెలికాన్, పెయింటెడ్ స్టార్క్ అనే వలస పక్షులు టెక్కలి మండలం తేలినీలాపురంలోని విదేశీ పక్షుల కేంద్రానికి చేరుకుని సంతానోత్పత్తి చేసుకుని తిరిగి తమ పిల్లలతో కలిసి వెళ్లిపోతాయి. ఈ ఈ పర్యాటక కేంద్రం వద్ద చింతచెట్లపై చేసే విన్యాసాలు, కేరింతలు చూసేందుకు పరిసర ప్రాంతాల నుంచే కాకుండా ఒడిశా, ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి భారీగా పర్యాటకులు తరలివస్తుంటారు. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన ఈ కేంద్రంలో ఇటు పక్షులకు అటు



శిథిలావస్థకు చేరుకుంటున్న వాచ్ టవర్

పర్యాటకులకు అనేక సమస్యలు వేధిస్తున్నాయి.

ప్రధాన ఇబ్బందులివే..

ఏటా ఇక్కడి పక్షులను చూసేందుకు వచ్చే వారికి అనేక సమస్యలు స్వాగతిస్తున్నాయి. తాగునీరు, మరుగుదొడ్లు వంటి కనీస మౌలిక సదుపాయాలు లేక ఇబ్బందులు తప్పడం లేదు. అరకొరగా ఉన్న మరుగుదొడ్లకు తలుపులు విరిగిపోవడంతో నిరుపయోగంగా మారాయి. చిన్నారులు ఆడుకునేందుకు ఏర్పాటు చేసిన క్రీడా సామగ్రి సైతం పాడైపోయాయి.

పక్షులను చూసేందుకు ఏర్పాటు చేసిన వాచ్ టవర్ నిర్మాణం జరిగి దశాబ్దాలు పూర్తికావడంతో శిథిలావస్థకు చేరుకోవడంతో పర్యాటకులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అంతే కాకుండా కింద పడిన పక్షులకు సైతం సరైన సంరక్షణ ఉండటం లేదని స్థానికులు చెబుతున్నారు.ఇటీవల రాష్ట్ర మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తేలినీలాపురం పక్షుల విడిది కేంద్రాన్ని సందర్శించి కేంద్రాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేస్తామని ఇచ్చిన హామీ ఇచ్చారు. ఆ తర్వాత ఆ సంగతే మర్చిపోయారని, ఇప్పటికైన సంబంధిత అధికారులు స్పందించి పూర్తి స్థాయిలో మౌలిక వసతులు కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

గంజాయి రవాణా అరికట్టేందుకు చర్యలు



సమావేశంలో మాట్లాడుతున్న డీఐజీ గోపీనాథ్ జెట్టి

శ్రీకాకుళం క్రైమ్: గంజాయి రవాణాను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి ఎస్పీలను ఆదేశించారు. శుక్రవారం రేంజ్ పరిధిలోని అల్లూరి, అనకాపల్లి, విజయనగరం, పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం జిల్లాల ఎస్పీలతో డీఐజీ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. గంజాయి నిర్మూలన, శాంతి భద్రతల పరిరక్షణ, వివిధ నేరాల నిరోధక చర్యలపై స్పష్టమైన మార్గదర్శకాలు చేశారు. అక్రమ గంజాయి రవాణా వ్యాపారంలో పాల్గొన్న 14 మంది నేరస్తుల ఆస్తులు రూ.10,04,89,621 స్వాధీనం చేసుకోవడాన్ని అభినందించారు. ఇప్పటి వరకు 1,119 మంది గంజాయి నేరస్తుల కదలికలపై షీట్లు తెరిచినట్టు చెప్పారు. అలాగే 51 మంది నిందితులపై పీడీ చట్టం, 80 మందిపై పీఐటీ ఎన్‌డీపీఎస్ చట్టం అమలుకు ప్రతిపాదనలు చేసినట్లు వెల్లడించారు. తరచూ గంజాయి రవాణా చేసే 368 మంది, అలాగే గంజాయితో పాటు ఇతర నేరాలలో పాల్గొన్న 370 మందిని గుర్తించి వారిపై చట్టపరమైన చర్యలు తీసుకున్నట్లు వివరించారు. న్యాయస్థానాలు ఇచ్చిన నాన్ బెయిలబుల్ వారెంట్లు ఆధారంగా 341 మందిని పట్టుకుని కోర్టులో హాజరుపరిచినట్లు తెలిపారు. ఈ ఏడాదిలో ఇప్పటి వరకు 20 కేసుల్లో 33 మంది నిందితులకు శిక్షలు పడ్డాయన్నారు. వీరిలో 24 మందికి 10 నుంచి 20 సంవత్సరాల వరకు జైలు శిక్షలు ఖరారయ్యాయన్నారు. విశాఖపట్నం రేంజ్ పోలీసులు స్టే సేఫ్, నిదాన్, కాజ్, నాట్ గ్రిడ్ యాప్స్ ద్వారా పరారీలో ఉన్న నిందితులను పట్టుకోవడంలో కృషిని అభినందించారు. మహిళలు, పిల్లలపై లైంగిక నేరాలు, మహిళ మిస్సింగ్ కేసులపై సమీక్షించారు. ఇటువంటి కేసుల్లో త్వరితగతిన దర్యాప్తు చేపట్టాలని ఆదేశించారు. ఎస్సీ, ఎస్టీ అత్యాచార నిరోధక చట్టం కింద నమోదైన కేసులను నిర్ణీత సమయంలో పరిష్కరించాలని చెప్పారు. రేంజ్ పరిధిలోని శాంతి భద్రతల సమస్యలపై చర్చించారు. భవిష్యత్తు కోసం తగిన కార్యాచరణ ప్రణాళికను రూపొందించారు. సమావేశంలో అల్లూరి సీతారామరాజు జిల్లా ఎస్పీ అమిత్ బర్గర్, అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా, విజయనగరం జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ మాధవరెడ్డి, శ్రీకాకుళం జిల్లా ఎస్పీ మహేశ్వర్ రెడ్డి పాల్గొన్నారు.

గంజాయితో నవ దంపతులు అరెస్టు

పలాస: గంజాయిని అక్రమంగా రవాణా చేస్తున్న బీహార్‌కు చెందిన నవ దంపతులు జూలీ ప్రవీణ్, సాజిత్ అన్సారీలను కాశీబుగ్గ రైల్వే పోలీసులు అరెస్టు చేశారు. ఈ మేరకు పలాస జి.ఆర్.పి సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎ.రవికుమార్ శుక్రవారం విలేకరులకు వివరాలు వెల్లడించారు. బీహార్ రాష్ట్రం గాంధీనగర్‌కు చెందిన సాజిత్ అన్సారీ, బోజ్‌పూర్ జిల్లాకు చెందిన జూలీ ప్రవీణ్‌లకు ఇటీవలే వివాహం జరిగింది. పశ్చిమబెంగాల్‌కు గంజాయి రవాణా చేస్తే అధిక మొత్తంలో డబ్బులు ఇస్తామని మధ్యవర్తులు ఆశ చూపడంతో అక్రమ రవాణాకు అంగీకరించారు. ఈ క్రమంలో పలాస రైల్వే స్టేషన్‌కు వచ్చిన వీరిని అనుమానించిన ఆర్‌పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ ఎం.మాల్యాద్రి బ్యాగులను పరిశీలించారు. అందులో 40 కిలోల గంజాయి పట్టుబడింది. దీని విలువ



పట్టుబడిన గంజాయి, నిందితులతో రైల్వే పోలీసులు

సుమారు రూ.2లక్షలు ఉంటుందని అంచనా. నిందితులను అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. జి.ఆర్.పి స్టేషన్ ఇన్‌చార్జి ఎం.మధుసూదనరావు కేసు నమోదు చేశారు. నిందితులను విశాఖ జైలుకు తరలించినట్టు రవికుమార్ చెప్పారు.

13, 14వ తేదీల్లో జేవీవీ రాష్ట్ర మహాసభలు

శ్రీకాకుళం: జన విజ్ఞాన వేదిక 18వ రాష్ట్ర మహాసభలు సెప్టెంబర్ 13, 14 తేదీలలో విజయనగరంలో నిర్వహిస్తున్నట్లు జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు గొంటి గిరిధర్, కుప్పిలి కామేశ్వరరావు శుక్రవారం తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.గేయానంద్ అధ్యక్షతన జరిగే ఈ కార్యక్రమంలో ఆల్ ఇండియా పీపుల్ సైన్స్ నెట్‌వర్క్ జాతీయ కార్యదర్శి ఆశా మిశ్రా, పూర్వ ఎమ్మెల్సీలు డాక్టర్ కె.నాగేశ్వర్, వి.బాల సుబ్రహ్మణ్యం, కె.ఎస్.లక్ష్మణరావు తదితరులు పాల్గొంటారని పేర్కొన్నారు. విద్య, ఆరోగ్యం, పర్యావరణం, స్వావలంబన అంశాలపై చర్చించి శాస్త్రీయ సమాజ నిర్మాణం కోసం కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు.

పాఠశాల తరలింపుపై నిరసన



అధికారులకు సమస్య వివరిస్తున్న గ్రామస్తులు

బూర్జ: అల్లెన ప్రాథమికోన్నత పాఠశాలను గ్రామంలోనే కొనసాగించాలని, వేరే పాఠశాలలో విలీనం చేయవద్దని కోరుతూ సర్పంచ్ జడ్డు మహేష్, విద్యార్థులు, తల్లిదండ్రులు, గ్రామస్తులు శుక్రవారం నిరసన వ్యక్తం చేశారు. ఇంత వరకు ఆన్‌లైన్‌లో హాజరు నమోదు చేయకపోవడం తగదన్నారు. ఈ మేరకు శ్రీకాకుళం సమగ్ర శిక్ష ఏఎంఓ చిగురుపల్లి సుధాకరరావు, సీఎంఓ బొడ్డేపల్లి శ్రీధర్, ఐఈసీఓ గోవిందరావు వద్ద సమస్య వివరించారు. ఇక్కడి 3, 4, 5వ తరగతులను పాలవలస ప్రైమరీ మోడల్ స్కూల్‌కు, 6, 7, 8వ తరగతులను పాలవలస జెడ్పీ హైస్కూల్‌కు తరలించారని ఆవేదన వ్యక్తం చేశారు. నాగావళి నది ఒడ్డున ఉన్న పాలవలస వెళ్లాలంటే సుమారు 12 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుందని, అంతదూరం చిన్నారులు ఎలా వెళ్తారని ప్రశ్నించారు. దీనిపై అధికారులు స్పందిస్తూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని చెప్పారు. నిరసన కార్యక్రమంలో సర్పంచ్‌తో పాటు విద్యాకమిటీ చైర్మన్ మురపాక శంకరరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

మహిళలు ఆరోగ్యంపై దృష్టి పెట్టాలి



డీఎంహెచ్‌ఓ డాక్టర్ కె.అనిత

శ్రీకాకుళం న్యూకాలనీ: మహిళలు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ కె.అనిత అన్నారు. శుక్రవారం డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ స్త్రీ ఆరోగ్యంపై అవగాహన, చికిత్స, వైద్య పరీక్షలు, ప్రత్యేక వైద్య నిపుణుల సేవలను ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 జిల్లా వ్యాప్తంగా నిర్వహించడానికి ప్రత్యేక కార్యాచరణ రూపొందించినట్లు తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల కుటుంబ సంక్షేమం మంత్రిత్వ శాఖ ఆదేశాల మేరకు స్వస్థనారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమం ద్వారా ఎన్.సి.డి స్క్రీనింగ్, క్యాన్సర్ స్క్రీనింగ్, ప్రసూతి సంరక్షణ, తల్లి, పిల్లల రక్షణ కార్డ్, ఇమ్యునైజేషన్, రక్తహీనత స్క్రీనింగ్, రుతు పరిశుభ్రత తదితర అంశాలపై అవగాహన కల్పించనున్నట్టు వివరించారు.

బాల్య వివాహాలు నేరం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ పీడీ విమల

శ్రీకాకుళం అర్బన్: విద్యార్థులు చట్టాలపై అవగాహన పెంచుకోవాలని జిల్లా స్త్రీ, శిశు సంక్షేమ శాఖ అధికారి ఐ.విమల అన్నారు. శుక్రవారం నగరంలోని గూనపాలెంలో శాంతినికేతన్ కళాశాలలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన కల్పించారు. బాలికలకు చిన్నతనంలోనే వివాహాలు చేయడం చట్టరీత్యా నేరమన్నారు. చుట్టుపక్కల ప్రాంతాల్లో ఎవరికైనా బాల్యవివాహాలు జరిగితే 1098కు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎస్.అప్పలరాజు, వార్డు ఇన్‌చార్జి కొర్ను నాగార్జున ప్రతాప్, సీడీపీఓ నాగరాణి, సూపర్‌వైజర్లు బి.యోగేశ్వరి, యశోద, పి.సీతామహాలక్ష్మి, కళ్యాణి పాల్గొన్నారు.

మూడు వేల మెట్రిక్ టన్నుల ఎరువులేవీ?

- సర్వసభ్య సమావేశంలో జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ



సమావేశంలో మాట్లాడుతున్న పిరియా విజయ

ఇచ్ఛాపురం రూరల్: కేంద్ర మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు జిల్లాకు మూడు వేల మెట్రిక్ టన్నుల ఎరువులు అందజేశామని చెబుతున్నారని, అవి ఎప్పుడు వచ్చాయి.. ఎంత మంది రైతులకు అందజేశారో తెలియజేయాలని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. శుక్రవారం ఇచ్ఛాపురం ఎంపీపీ బోర పుష్ప అధ్యక్షతన ఎంపీడీఓ సమావేశ మందిరంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. వ్యవసాయాధికారి పి.పి.వి.వి.అజేయ్‌కుమార్ వ్యవసాయ సమీక్షలో మాట్లాడుతుండగా టీడీపీ ఎంపీటీసీ సభ్యురాలు దక్కత ఏకాంబరి కలగజేసుకొని కేంద్ర మంత్రి జిల్లాకు 3వేల టన్నుల ఎరువులు అందజేశారని, ప్రతిపక్షం కావాలనే ఆరోపణలు చేస్తోందన్నారు. మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, సర్పంచ్ పి.రాజశేఖర్ మాట్లాడుతూ వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఎరువులకు కొరత ఉండేది కాదని, కూటమి ప్రభుత్వంలో మాత్రం రైతులు రోడ్డెక్కాల్సిన పరిస్థితి వచ్చిందని, ఒడిశాలో వెయ్యికి చొప్పున బస్తా యూరియాను కొనుగోలు చేయాల్సిన దుస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. ఖరీఫ్‌కు సంబంధించి ఇప్పటి వరకు ఈ–క్రాప్ చేయలేదని, పంటలు నష్టపోయిన వారికి ఇన్‌పుట్ సబ్సిడీ అందించే పరిస్థితిలో ప్రభుత్వం లేదని పలువురు సభ్యులు ఆరోపించారు. జెడ్పీ చైర్‌పర్సన్ విజయ మాట్లాడుతూ గత ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా ప్రతి రైతుకు ఎరువులు అందించామని, కూటమి ప్రభుత్వంలో టీడీపీ నాయకుల ఇళ్ల వద్ద ఆ పార్టీ సానుభూతిపరులకు మాత్రమే అందిస్తున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వ హయాంలో బాహుదానదిపై సుమారు రూ.20 కోట్లతో కొత్త వంతెన నిర్మాణానికి ప్రతిపాదనలు, అంచనా విలువలు, ఆమోదం పూర్తయితే కూటమి ప్రభుత్వం రద్దు చేయడం దారుణమన్నారు. ఒడిశాకు చెందిన వ్యక్తులు ఆంధ్రాలో ప్రయోజనం పొందుతున్నారని, అంగన్‌వాడీ కేంద్రాల్లో కార్యకర్తలు సమయపాలన పాటించడం లేదని, పిల్లలకు, గర్భిణులకు, బాలింతలకు ఇచ్చే సరుకులను అంగంట్లో అమ్మేస్తున్నారని సభ్యులు దక్కత ఏకాంబరి, దున్న గురుమూర్తిలు ఆరోపించారు. సమావేశంలో ఎంపీడీఓ కె.రామారావు, తహసీల్దార్ ఎస్.వెంకటరావు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

ఎరువుల కోసం రైతుల పాట్లు



హిరమండలంలో బారులుదీరిన రైతులు

హిరమండలం: ఎరువుల కోసం రైతులకు పాట్లు తప్పడం లేదు. ఏ షాపు వద్ద చూసినా బారులు తీరిన రైతులే కనిపిస్తున్నారు. హిరమండలం పరిధిలో రైతులకు 60 మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరం. శుక్రవారం కేబీసీ షాపునకు 10 మెట్రిక్ టన్నులు మాత్రమే వచ్చాయి. దీంతో రైతులు పదుల సంఖ్యలో ఎగబడ్డారు. అరకొర అందడంతో నిరాశతో వెనుదిరిగారు. పూర్తిస్థాయిలో ఎరువులు అందించడంలో కూటమి ప్రభుత్వం విఫలమైందని పలువురు మండిపడ్డారు. కాగా, రెండురోజుల్లో రైతులకు సరిపడా ఎరువులు అందిస్తామని అధికారులు చెబుతున్నారు.

బ్యాంకుమిత్రల నియామకానికి దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలోని కేంద్ర ప్రభుత్వ బ్యాంకులైన బ్యాంక్ ఆఫ్ ఇండియా, బ్యాంక్ ఆఫ్ బరోడా, ఇండియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్‌లలో బ్యాంకుమిత్రల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మ్యాగ్నెట్ కన్సల్టెన్సీ జిల్లా సమన్వయకర్త బి.అనంతకుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అన్ని బ్రాంచీల్లోనూ ఖాళీలు ఉన్నాయని, గ్రామీణ ప్రాంతాల్లో పనిచేసేందుకు టెన్త్ పాసైన, 18 నుంచి 50 ఏళ్ల నిరుద్యోగ మహిళలు, పురుషులు అర్హులని పేర్కొన్నారు. దీనికి వేతనము ఉండదని, పనిని బట్టి కమిషన్ ఉంటుందన్నారు. ప్రధానమంత్రి జన్ ధన్ యోజన అకౌంట్స్, జన సురక్ష స్కీమ్స్ తదితర సేవల్లో బ్యాంకు మిత్ర కీలక పాత్ర వహిస్తారని తెలిపారు. వివరాలకు 9493289488 నంబర్‌ను సంప్రదించవచ్చని పేర్కొన్నారు.

శ్రీకూర్మనాథాలయం పాలకమండలి ఏర్పాటు

గార : ప్రముఖ విష్ణుక్షేత్రం శ్రీకూర్మంలోని కూర్మనాథాలయానికి పాలకమండలి ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం శుక్రవారం ఉత్తర్వులు జారీ చేసింది. ట్రస్టీగా ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పూసపాటి అశోకగజపతిరాజు, ఎక్స్ అఫీషియో మెంబర్‌గా ఆలయ ప్రధానార్చకులు చామర్ల సీతారామ నృసింహాచార్యులు, మెంబర్లుగా గుంటురెడ్డి సంయుక్త, కైబాడి కుసుమకుమారి, పల్ల పెంటయ్య,



గొండు శ్రీనివాసరావు, అంధవరపు మౌనిక, ఆరవెల్లి శ్వేతబిందు, తాన్ని సూరిబాబు, మల్ల కల్యాణ చక్రవర్తి, జమ్ము లక్ష్మి నియమితులయ్యారు.

16న పీడీఎస్ బియ్యం వేలం

కొత్తూరు: మండలంలో శ్రీకాకుళం విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్, సివిల్ సప్లయ్ డీటీల తనిఖీల్లో పట్టుబడి సీజ్ చేసిన 390.50 కింటాళ్ల బియ్యాన్ని ఈ నెల 16న తహసీల్దార్ కార్యాలయంలో వేలం వేయనున్నట్లు తహశీల్దర్ కె.బాలకృష్ణ శుక్రవారం తెలిపారు. సీజ్ చేసిన బియ్యం సరుబుజ్జిలి మండలం ఎంఎల్‌ఎస్ పాయింట్‌లో ఉందని, కిలో ధర 42.5గా నిర్ణయించామని చెప్పారు. ఎటువంటి డిపాజిట్ చెల్లించాల్సిన అవసరం లేదని పేర్కొన్నారు.


తండ్రి మందలించాడని..



గుడిదాపు మణి (ఫైల్)

బూర్జ : సెల్‌ఫోన్ పోయిందని తండ్రి మందలించడంతో మనస్థాపానికి గురైన బూర్జ గ్రామానికి చెందిన గుడిదాపు మణి(33) ఈ నెల 1న కూల్‌డ్రింక్‌లో గడ్డి మందు కలిపి తాగాడు. వెంటనే కుటుంబ సభ్యులు పాలకొండ ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందాడు. మణి గతంలోనూ కుటుంబ కలహాల నేపథ్యంలో రెండుసార్లు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. మృతుడికి భార్య లలితకుమారి, రెండేళ్ల కుమారుడు సోహిత్ ఉన్నాడు. తండ్రి అప్పలనాయుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై ఎం.ప్రవల్లిక కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

విద్యుత్ షాక్‌తో సచివాలయ ఉద్యోగి మృతి



మామిడి సురేష్ (ఫైల్)

జలుమూరు/టెక్కలి రూరల్: టెక్కలిపాడు సచివాలయంలో ఎనర్జీ అసిస్టెంట్‌గా విధులు నిర్వహిస్తున్న మామిడి సురేష్ (34) శుక్రవారం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. కోటబొమ్మాళి సబ్ డివిజన్‌లోని కిష్టపురం వద్ద విద్యుత్ లైన్‌కు అడ్డుగా ఉన్న చెట్టు కొమ్మలు తొలగిస్తుండగా పక్కనే ఉన్న 11 కె.వి.లైన్ తగలడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదం జరిగిన వెంటనే ప్రథమ చికిత్స చేసి కోటబొమ్మాళి ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. సురేష్ స్వగ్రామం పాగోడు. తల్లిదండ్రులు, భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. కాగా, సచివాలయం పరిధిలో ఉన్న ఉద్యోగికి వేరే మండలంలో ఎలా డ్యూటీలు వేస్తారని గ్రామ సర్పంచ్ దామ మన్మధరావుతోపాటు కుటుంబ సభ్యులు విద్యుత్ అధికారులను ప్రశ్నిస్తున్నారు. సురేష్ మృతితో పాగోడులో విషాద ఛాయలు అలముకున్నాయి.